# COMMUNIST PARTY OF INDIA (MARXIST)
## Telangana State Committee
M.B.Bhavan, H. No.1-1-60/2, RTC 'X' Roads, Hyderabad -20.
Ph. 040- 27665011 /12, Fax : 27665013, Email-cpimtelangana@gmail.com


ప్రచురణార్థం/ ప్రసారార్థం: తేది. 18.03.2021

## బడ్జెట్‌లో అంకెలు పెంచి చూపారు తప్పఉపాధి, అభివృద్ధి జరుగుతుందా?

2021-22 బడ్జెట్ రు.2,38,825 కోట్లతో శాసనసభలో ప్రవేశపెట్టారు. ఒకవైపు 2021 బడ్జెట్‌ను రు 25,394 కోట్లకు తగ్గిస్తూ మరోవైపు గత రివైజ్డ్ బడ్జెట్‌పై రు.64,097 కోట్లకు పెంచి చూపారు. పన్నుల ఆదాయం రు 76 వేల కోట్ల నుండి రు 93 వేల కోట్లకు పెంచి ప్రజలపై భారాలు వేశారు. ఏనాడూ రు 12 వేల కోట్లు దాటని పద్దును రు 28 వేల కోట్లకు పెంచారు. బడ్జెట్‌లో అంకెలను పెంచి చూపారు తప్ప ఆదాయం సమీకరణ, ఉపాధి, అభివృద్ధి జరుగుతుందా అని సిపిఐ(యం) తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నది.

2014 నుండి ఏటా 24% బడ్జెట్ కోతలు పెడుతూనే వస్తున్నారు. బడ్జెట్ ఎక్కువ చూపి దళితులు, గిరిజనలు, బిసిలు, మైనార్టీలు, స్త్రీ శిశు సంక్షేమం, ఆరోగ్యం, విద్యా రంగాలకు కేటాయింపులు భారీగా చూపుతూ సంవత్సరం ముగిసే నాటికి 30 నుండి 40 శాతం బడ్జెట్‌లో కోత పెట్టడం జరుగుతున్నది. బలహీన వర్గాలకు ఆశలు కల్పించి వారిని భ్రమల్లో పెట్టడమే తప్ప వాస్తవంగా వారి అభివృద్ధి జరగడంలేదు. ముఖ్యమంత్రి ఎంపవర్ కమిటీ పేరుతో దళితులకు 1000 కోట్లు, సబ్‌ప్లాన్ పేరుతో రు 21,340 కోట్లు మరియు బడ్జెట్‌లోను భారీ కేటాయింపులు చూపారు. ఈ వర్గానికి కేటాయించిన బడ్జెట్‌లో 50 శాతం కూడా వ్యయం చేసిన సందర్భాలు లేవు. ఘనంగా ప్రకటించిన 3 ఎకరాల భూమి కొనుగోలుకు ఈ బడ్జెట్‌లో స్థలం దొరకలేదు. గిరిజనులపై చూపిన ఓదార్పు నిధుల వినియోగంలో లేదు. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశామని చెపుతున్న ప్రభుత్వం, 2021 సం॥లో ప్రకృతి వైపరీత్యాల వల్ల మొత్తం 8,830 కోట్లు నష్టం జరిగినట్లు అంగీకరించిన తర్వాత కూడా ఒక్క రూపాయీ కేటాయించకపోవడం ప్రభుత్వ వక్రదృష్టికి అద్దం పడుతున్నది. వర్షాలు సహకరించడంతో వ్యవసాయ రంగం ఉత్పత్తిని పెంచింది తప్ప పరిశ్రమలు, సేవా రంగం పూర్తిగా దెబ్బతిన్నాయి. నిరుద్యోగ భృతిపై ఊసే లేదు.

అలాగే విద్య, వైద్య రంగాలకు సంబంధించి ప్రణాళిక లేకుండా కేటాయింపులు చూపారు. ప్రభుత్వం ప్రకటించినట్లు రాష్ట్ర స్థూల ఉత్పత్తి 13.5 శాతం నుండి 1.3 శాతానికి తగ్గింది. మార్చి నాటికి రు 2.87 లక్షల కోట్లు అప్పు అవుతుందని, దానికి వడ్డీ చెల్లింపుల కింద రు 40,840 కోట్లు చెల్లించాలని ఈ బడ్జెట్‌లో చూపారు. వాస్తవానికి కార్పొరేషన్ల కింద తెచ్చిన అప్పులు కలిపితే 3.50 లక్షల కోట్లకు అప్పు పేరుకుపోయింది. అప్పుల రాష్ట్రంగా ఉన్న తెలంగాణలో పేద జనాలు అభివృద్ధికి నోచుకోగలరా? ఈ జంబో బడ్జెట్ ద్వారా రాష్ట్రంలో ఉపాధి, జీవన వ్యయం పెరుగుదల సాధ్యం కాదు. గత ఆరేండ్లుగా ప్రజలను భ్రమలకు గురిచేస్తున్న బడ్జెట్ తతంగం ఈ సంవత్సరం కూడా అంతకుమించిన భ్రమలు కలిగించే దారిలో రూపొందించారు. వాస్తవ అభివృద్ధి సాధించే దిశగా ఉపాధి కల్పించే విధంగా బడ్జెట్‌ను రూపకల్పన చేయాలని సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్రకమిటీ రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

(తమ్మినేని వీరభద్రం)
రాష్ట్ర కార్యదర్శి